క్లుప్తంగా

కేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



యలమంచిలి: ధనుర్మాస పూజల్లో భాగంగా ఆదివారం స్థానిక కేశవస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి వారికి లక్ష చామంతి, తులసి పూజ నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు వాడపల్లి గోపి కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఈ పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి పూజలో పాల్గొన్నారు. గ్రామస్తుల సహకారంతో జరుగుతున్న ధనుర్మాస పూజలను ఆలయ కార్యనిర్వహణాధికారి నామాల సతీష్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

వెంకన్నకు వెండి పాదాల సమర్పణ



వేంకటేశ్వర స్వామికి వెండి పాదాలు సమర్పిస్తున్న దాతలు

పెనుగొండ: పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయం ఉపాలయంలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి అమెరికా వాస్తవ్యులు సత్తి రామకృష్ణారెడ్డి, శ్వేతా చంద్రిక దంపతులు వెండి పాదాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయంలో పూజలు నిర్వహించి ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లురావుకి రూ.75వేలు విలువైన పాదాలను అందించారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలతో పాటు భీమవరం, పాలకొల్లు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ, చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పసలదీవిలో ధనుర్మాస ఉత్సవాలు



పసలదీవిలో తిరుప్పావై ప్రవచనం చేస్తున్న మహిళలు

నరసాపురం రూరల్: సకల వేదాల సారం తిరుప్పావై అని, గోదాదేవి అందించిన తిరుప్పావై పాశురాలతో సర్వ వేదాల సారం ఇమిడి ఉందని శ్రీమాన్ ముదుంబై వెంకటాచార్యులు అన్నారు. పసలదీవి రామాలయంలో ధనుర్మాసం సందర్భంగా జరుగుతున్న తిరుప్పావై ప్రవచనాలను పురస్కరించుకుని ప్రతి రోజూ ఉదయం 6.30 నుంచి 7.30 వరకూ జరిగే ప్రవచనాల కార్యక్రమాలకు భక్తులు విశేష సంఖ్యలో పాల్గొంటున్నారు. నిత్యం తిరుప్పావై గురించి అనేక అంశాలను భక్తులకు వివరిస్తున్నారు. ఆదివారం పెద్ద సంఖ్యలో మహిళలు తిరుప్పావై ప్రవచన సేవలో పాల్గొన్నారు.

చాంబర్ ప్రధాన కార్యదర్శిగా నాగేంద్రకుమార్

పాలకొల్లు అర్బన్: చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రధాన కార్యదర్శిగా కఠారి నాగేంద్ర కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం చాంబర్ ఆఫ్ కామర్స్ భవన్‌లో అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. నాగేంద్రకుమార్‌ను చాంబర్ సభ్యులు, యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ప్రత్యేకంగా అభినందించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని చెప్పారు.

పెనుగొండలో..

పెనుగొండ: పెనుగొండ పంచాయతీలో సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించనున్నట్లు సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పాల్గొంటారని తెలిపారు. ఉదయం 8:30 నుంచి నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ ఫిర్యాదులు అందించాలని కోరారు.

దత్తత ఇంట.. ప్రకృతి పంట



చింతపర్రులో వ్యయభూమిలో వంగ తోట నాటుతున్న దృశ్యం



వడ్లవానిపాలెంలో కూరగాయలు పండిస్తున్న రైతు



కాపవరంలో రైతుకి సూచనలిస్తున్న అధికారులు

- సేంద్రియ విధానంలో కూరగాయల సాగు
- పాలకొల్లులో 5 దత్తత గ్రామాలు
- పెరటి పంటలు సాగులో 60 మంది రైతులు

పాలకొల్లు అర్బన్: రసాయనిక ఎరువులతో సాగు చేసిన ఆహార ఉత్పత్తులు విషతుల్యంగా మారుతున్నాయి. దీంతో సేంద్రియ విధానంలో సాగు చేసిన ఆహార ఉత్పత్తులపై ప్రజలు మక్కువ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి పంటల సాగును రైతులు ఇష్టపడుతున్నారు. కాబట్టి రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం విభాగం మండలంలోని 5 గ్రామాలను దత్తత తీసుకుని ప్రకృతి వ్యవసాయం చేయడానికి ప్రోత్సహిస్తున్నారు. మండలంలోని వాలమర్రుని ఓ క్లస్టర్‌గా గుర్తించి, ఈ గ్రామాన్ని అనుకుని ఉన్న అరట్లకట్ట, కాపవరం, చింతపర్రు, వడ్లవానిపాలెం గ్రామాలను దత్తత తీసుకుని సేంద్రియ విధానంలో సహజ సిద్ధమైన పంటలను పండిస్తున్నారు. సేంద్రీయ విధానంలో వరి, చేపలు, ఉద్యాన పంటలు, కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసి రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు. అలాగే వాలమర్రు, అరట్లకట్ట, కాపవరం, చింతపర్రు, వడ్లవానిపాలెం గ్రామాల్లోని పెరట్లో కూరగాయలు సాగుకు ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రోత్సాహాన్నిస్తుంది.

కూరగాయలు

సేంద్రియ విధానంలో సాగు చేసిన కూరగాయల విత్తనాలను సేకరించి వంగ, బెండ, టమాటా, మిరప, కాకర, ఆనబ, బీర, గోరు చిక్కుడు, చెట్టుచిక్కుడు పండిస్తున్నారు. అలాగే తోటకూర, మెంతుకూర, పాలకూర, గోంగూర, బచ్చలి సాగు చేసి ఆరోగ్యకరమైన పంటలు పండిస్తున్నారు.

సూర్యమండల ఆకారంలో సాగు

పెరట్లో 2 నుంచి 3 సెంట్లు స్థలాన్ని ఎంపికి చేసి సూర్య మండల ఆకారంలో ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి కూరలు పండిస్తున్నారు.

జీవామృతమే ఎరువు

దేశవాలీ ఆవు నుంచి సేకరించిన పేడ, మూత్రం, బెల్లం, సెనగపిండి, పుట్టమన్ను, నీరు వినియోగించి తయారు చేసిన జీవామృతాన్ని పెరట్లో సాగు చేస్తున్న ఆకు కూరలు, కాయగూరలకు ఎరువుగా వాడుతున్నారు.

తెగుళ్ల నివారణ ఇలా

రసం పీల్చు పురుగులు, ఇతర చిన్న పురుగుల నివారణకు నీమాస్త్రం పిచికారీ చేస్తున్నారు. ఆవు పేడ, ఆవుమూత్రం, వేపాకు రసంతో నీమాస్త్రం తయారు చేసుకుని తెగుళ్లను నివారిస్తున్నారు.

సాగు చేసే రైతులు ఇలా

గ్రామం	రైతులు
వాలమర్రు	10
అరట్లకట్ట	15
కాపవరం	15
చింతపర్రు	10
వడ్లవానిపాలెం	05

జీవామృతం వినియోగిస్తున్నాం



నేను వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాను. నేనే మా ఇంటి పెరట్లో కూరగాయలు సేంద్రీయ విధానంలో సాగు చేసుకుంటున్నాను. ఆవుపేడ, మూత్రం, శెనగపిండి, బెల్లం, పుట్టమన్ను కలిపి జీవామృతం తయారు చేసుకుని కాయగూరల మొక్కలకు ఎరువుగా వాడుతున్నాను. మొక్కలు ఏపుగా పెరిగి దిగుబడి బాగా వస్తున్నాయి.

– గోనిపాటి సునీల్‌కుమార్, అరట్లకట్ట

ఆకు కూరలతో ఉపాధి



ఇంటి పెరట్లో 3 సెంట్లు స్థలంలో సూర్య మండలం ఆకారంలో ఆకు కూరలు పెంచుతున్నాను. గోంగూర, తోటకూర, మెంతుకూర, పాలకూర, బచ్చలి కూరలు పెంచుతున్నాం. దీంతో పాటు వంగ, బెండ, టమాటతో పాటు బీర, ఆనబ పాదులు పెట్టుకున్నా. ఏపుగా పెరిగి దిగుబడి బాగా వస్తున్నాయి.

– సబ్బితి సాల్మన్‌రాజు, వాలమర్రు

1న సినీ పాటల పోటీలు

పెనుగొండ: ఆదర్శ రైతు రంకిరెడ్డి వీరన్న, సత్యవతిల జ్ఞాపకార్థం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి సినీ పాటల పోటీలను మహర్షి సాత్యవతేయ విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ రంకిరెడ్డి రామ్మోహనరావు ఆదిఆవరం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలను ఇరగవరం మండలం అయితంపూడిలో జనవరి 1వ తేదీ 2 గంటల నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కన్వీనరు చివటం సుబ్బారావు, సెల్ నంబర్ 9849528590కు ఫోన్ చేయాలని సూచించారు.

పీవీ రావుకు ఘన నివాళి

పాలకొల్లు అర్బన్: మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత పోతుల విఘ్నేశ్వరరావు (పీవీ రావు) 19వ వర్ధంతిని పీవీరావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాలకొల్లు పట్టణంలోని గాంధీబొమ్మల సెంటర్‌లో పీవీ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మానుకొండ శ్రీనుబాబు, కొర్రపాటి వీరాస్వామి, ఇంజేటి కుమారస్వామి, దేవ రాజేష్, పితాని పుష్పరాజ్, ఉప్పె పండుబాబు, బొంద పండు, వర్ధనపు పెదకాసు పాల్గొన్నారు.

ఉల్లంపర్రులో ఆరోగ్య శిబిరం



మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్న శ్యం

పాలకొల్లు అర్బన్: యునైటెడ్ ఇంటర్నేషనల్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉల్లంపర్రులో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. పాలకొల్లు టౌన్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నుంచి ఎముకల వైద్య నిపుణులు నారిన హర్ష, జనరల్ మెడిసిన్ డాక్టర్ కార్తీక్ పాల్గొని సుమారు 200 మంది రోగులను పరీక్షించి ఆరోగ్య సలహాలు అందించారు. బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ పెనుమాక రామమోహన్‌రావు, కార్యదర్శి వేరుకొండ దుర్గాప్రసాద్, శిరిగినీడి నాగార్జున, కానూరి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో తగ్గిన సందర్శకుల సందడి



కేపీ పాలెం బీచ్‌లో సందర్శకులు

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీనం వాయుగుండంగా మారడంతో గత నాలుగు రోజులుగా వాతావరణం మారింది. మబ్బులు, చలిగాలులు, చిరుజల్లుతో వాతావరణం సరిగ్గా లేకపోవడంతో ఆదివారం బీచ్‌కు తరలి వచ్చే సందర్శకుల రాకిడి తగ్గింది. వాతావరణం చల్లగా ఉన్నా బీచ్‌కు వచ్చిన పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం తీరంలోని ఆలయాలను సందర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో భవానీ హోమాలు



పెనుగొండలో భవానీ హోమాల్లో పాల్గొన్న డాక్టర్ కేఆర్ రాజు దంపతులు

పెనుగొండ: పెనుగొండ భవానీ పీఠంలో గురుభవానీలు పిల్లి శంకరం, నక్కా వేద వ్యాస శాస్త్రిల ఆధ్వర్యంలో హోమంలు పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం మహా గణపతి హోమం, నవగ్రహ హోమం, విజయలక్ష్మీ హోమాలను వేద పండితులు జోష్యుల వెంకటరామ్ శిష్య బృందం వేద మంత్రాలతో నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భవానీ మాలధారులతో పాటు ఎస్వీకేపీ విద్యా సంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు డాక్టర్ కలిదిండి అన్నపూర్ణ, గ్రామ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, కట్టంగ శ్రీనివాస్ కోకిరి రవి, తమనంపూడి అచ్చిరెడ్డి, మామిడిశెట్టి సతీష్, నాంద్ర పూర్ణచంద్ర రెడ్డి, పిల్లి దుర్గమ్మ, అడబాల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ మార్గాలపై అలసత్వం

అంతంతమాత్రంగా మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల ఆదాయం



నరసాపురం పట్టణంలో ఉన్న అల్లూరి షాపింగ్ కాంప్లెక్స్

నరసాపురం: ఆదాయ మార్గాలు పెంచుకుంటేనే స్థానిక సంస్థలు బలపడతాయనేది అందరూ అంగీకరించే అంశం. అయితే మునిసిపాలిటీ మాత్రం ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో మునిసిపాలిటీకి ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ల పరిస్థితిని గమనిస్తే, ఈ విమర్శల్లో పూర్తి నిజాలు ఉన్నాయన్న సంగతి తేటతెల్లమవుతుంది. మునిసిపల్ కాంప్లెక్స్‌లు అరకొర ఆదాయంతో కొట్టిమిట్టాడుతున్నాయి. పట్టణంలో మొత్తం 14 మునిసిపల్ కాంప్లెక్స్‌లు, వాటిలో 250 వరకూ షాపులు ఉన్నాయి. వీటి ద్వారా మునిసిపాలిటీకి కేవలం నెలకు రూ 2.85 లక్షలు మాత్రమే ఆదాయం వస్తుంది. చాలా షాపులు ఎప్పుడూ ఖాళీగానే ఉంటాయి. సెంటర్‌లో ఉన్న కీలకమైన అల్లూరి సత్యనారాయణరాజు షాపింగ్ కాంప్లెక్స్‌లో కూడా షాపులు భర్తీకాని పరిస్థితి.పైగా కాంప్లెక్స్ శిథిలమై మున్సిపాలిటీకి గుదిబండగా మారింది.

నిబంధనలకు విరుద్ధంగా లీజులు

ఇక షాపుల లీజుల విషయంలో కూడా అధికారులు నిబంధనలకు నీళ్లు వదలడం, వ్యాపారులతో లాలూచీ పడటంతో అద్దెలు పెరగని పరిస్థితి. దీర్ఘకాలం పాటూ తరతరాలుగా ఒకరే పలుకుబడితో షాపులు దక్కించుకోవడం, తక్కువ లీజులు చెల్లిస్తుండటం గమనార్హం. లోపాలను సరిదిద్ది, మునిసిపల్ అధికారులు ఆదాయం పెంచుకోవడానికి ఎప్పుడూ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇక ప్రస్తుతం ఉన్న కాంప్లెక్స్‌ల నిర్మాణం ప్రణాళికాబద్ధగా, వ్యాపారాలకు అనువుగా లేకపోవడం కూడా ఇబ్బందులు తెచ్చి పెడుతోంది. ఈ కారణం వల్లనే షాపుల భర్తీ అవ్వడం లేదనే వాదనలు కూడా విన్పిస్తున్నాయి. ఇక పాత శిథిలమైన కాంప్లెక్స్‌లను కొత్తగా నిర్మించే విషయంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అల్లూరి కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ శిథిలమైంది. దీంతో దానిని పడగొట్టి కొత్త కాంప్లెక్స్ నిర్మించినా, ఈ కొత్త కాంప్లెక్స్ ద్వారా కూడా ఆదాయం సవ్యంగా రావడంలేదు. మరికొన్ని ప్రాంతాల్లో కొత్త కాంప్లెక్స్‌ల నిర్మాణానికి అవకాశం ఉన్నప్పటికీ మునిసిపాలిటీ దృష్టి పెట్టడంలేదు.

ఘనంగా జగనన్న జన్మదిన వేడుకలు



జగన్ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం రాత్రి మండలంలోని చందపర్రులో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. చందపర్రు చిన్నోడు బొందా కుమారస్వామి విరాళంతో పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైసీపీ మండల గౌరవాధ్యక్షుడు ఎం మైఖేల్‌రాజు, పార్టీ నాయకులు చెన్ను విజయ్, పాలపర్తి కృపానాథ్, పేరూరి సన్నిబాబు, గోగులమండ రవిశేఖర్, కర్ని యాకోబు, పేరూరి కమలాకర్, గోగులమండ పండు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడికి పరామర్శ



మాధవ నాయుడిని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి

నరసాపురం రూరల్: నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు తండ్రి వీర సూర సత్య ప్రతాప్నాయుడు (74) ఉదయం గుండె పోటుతో మరణించారు. ఆదివారం వేకువ జామున అస్వస్థతకు గురి కావడంతో పట్టణంలోని ఓ ఆసుపత్రికి వెళ్లగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ వెళ్లాలని వైద్యులు సూచించడంతో విజయవాడ వెళ్లే మార్గమధ్యలో తీవ్ర గుండె పోటు కారణంగా మరణించారు. ఈయన మృతదేహాన్ని స్వగ్రామమైన సరిపల్లికి తీసుకువచ్చి సందర్శన నిమిత్తం ఉంచారు. మృతుడు ప్రతాపనాయుడికు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రతాపనాయుడు భౌతిక కాయాన్ని వైఎస్సార్ సీఈప జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, బొమ్మిడి నాయకర్, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఏపీ మైనార్టీ ఎఫైర్స్ చైర్మన్ ఎంఏ షరీఫ్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బండారు మాధవ నాయుడిని పరామర్శించారు.

హైటెక్ హరిదాసులు



మొగల్తూరులో మోటార్ సైకిల్‌పై తిరుగుతున్న హరిదాసు

ధనుర్మాసం వచ్చిందంటే గ్రామాల్లో హడావిడి నెలకొంటుంది. ఒకవైపు ఇంటి ముందు ముగ్గులు, మరోవైపు హరిదాసులు సందడితో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. ధనుర్మాసం నెలరోజులూ గ్రామాల్లో తిరిగే హరిదాసులు హరిలో రంగ హరి అంటూ పాటలు పాడుకుంటూ ఇంటింటికి తిరుగుతూ సందడి చేస్తారు. అయితే గతంలో కాలి నడకన ఇంటింటికీ తిరిగే హరిదాసులు మారుతున్న కాలానికి అనుగుణంగా మోటార్ సైకిల్‌పై తిరుగుతూ సందడి చేస్తున్నారు. ఆదివారం మొగల్తూరు గ్రామంలో ఓ హరిదాసు మోటార్ సైకిల్‌పై తిరుగుతున్నప్పుడు సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– మొగల్తూరు

దాతల సాయం కోసం ఎదురుచూపులు



బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న కడిమి కిరణ్ మణికంఠ

యలమంచిలి: మండలంలోని దొడ్డిపట్ల పంచాయతీ తాడిమెరక గ్రామానికి చెందిన కడిమి కిరణ్ మణికంఠ బోన్ క్యాన్సర్‌తో బాధపడుతూ వైద్య ఖర్చులకు దాతల సహాయం అర్థిస్తున్నాడు. కిరణ్ ఫొటో స్టూడియోలో కెమెరామెన్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఇరవై రోజులు క్రితం ఆరోగ్యం బాగోలేకపోవడంతో పాలకొల్లులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడు. పరీక్షించిన డాక్టర్ ప్లేట్లెట్స్ తగ్గాయని చెప్పి ప్లేట్లెట్స్ ఎక్కించారు. అయినా మళ్లీ ప్లేట్లెట్స్ డౌన్ అవుతుండటతో భీమవరం లోని ప్రైవేటు హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. అక్కడ పలు రకాల పరీక్షలు చేసిన తరువాత డాక్టర్లు బోన్ క్యాన్సర్ అని నిర్ధారించారు. చికిత్స కింద బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చెయ్యాలని, దానికి దాదాపు రూ. 70 లక్షల ఖర్చు అవుతుందని చెప్పారు. ఆపరేషన్ చేసే వరకు ప్రతి రెండు రోజులకు ఒకసారి ప్లేట్లెట్స్ ఎక్కించాలని చెప్పారు. ప్రస్తుతం ప్లేట్లెట్స్‌కు రెండు రోజులకు రూ.20 వేలు ఖర్చవుతుంది. కిరణ్ మణికంఠకు 18 నెలలు క్రితమే వివాహం అయ్యింది. 7 నెలల బాబు ఉన్నాడు. కిరణ్ మణికంఠ తల్లి చిన్నప్పుడే క్యాన్సర్‌తో మరణించారు. తండ్రి 8 ఏళ్ల క్రితం మెదడు సంబంధించిన వ్యాధితో మరణించారు. కిరణ్ దంపతులు ప్రస్తుతం ప్రభుత్వ స్థలంలో తాటాకిల్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. ఉండడానికి ఇల్లు కూడా లేని కిరణ్ వైద్యానికి అంత సొమ్ము లేక దాతల సహాయం అర్థిస్తున్నాడు. కిరణ్ పరిస్థితి తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆదివారం కిరణ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. విషయాన్ని పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి తగిన సహాయం అందేలా కృషి చేస్తానని భరోసా కల్పించారు. అదే విధంగా కిరణ్ వైద్యానికి దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. కడిమి కిరణ్ మణికంఠకు సహాయం చేయాలనుకునే దాతలు అతని ఫోన్ నెంబర్ 95058 86269 కు ఫోన్ పే, గుగూల్ పే చేయాలని కోరుతున్నారు.

దాళ్వా సాగు షురూ



వెంకట్రామపురంలో దమ్ములు చేసుకుంటున్న రైతులు



గట్టులంకలు బాగు చేసుకుంటున్న రైతన్నలు

పెనుగొండ: సార్వా సాగు ముగియడంతో దాళ్వా సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ, ఆచంట, పెనుమంట్ర, పోడూరు మండలాల్లో కోతలు పూర్తి కావచ్చాయి. దీంతో దాళ్వా సాగుకు అవసరమైన విత్తనాలు సేకరించి ఆకుమడులు వేయడంలో నిమగ్నమయ్యారు. కొందరు రైతులు ముందుగానే ఆకుమడులు పూర్తి చేయడంతో వరి చేలను పూర్తి స్థాయిలో దమ్ము చేయడం ప్రారంభించారు. గట్టులంకలు సరిచేసికొని, నాట్లుకు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలోని ఆచంట మండలంలో 10015 ఎకరాల్లోనూ, పోడూరు మండలంలో 12790 ఎకరాల్లోనూ, పెనుగొండ మండలంలో 11750 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 12156 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఆచంట వేమవరం, వల్లూరు వంటి నక్కల డ్రయిన్ పరివాహక ప్రాంతంలో సాగు ఆలస్యం కావడంతో ఇప్పుడిప్పుడే సిద్ధమవుతున్నారు. వీరు సార్వా సాగులో రెండు పర్యాయాలు ముంపునకు గురి కావడంతో పెట్టుబడులు అధికంగా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే పరిస్థితి పెనుమంట్ర మండలంలోని గోస్తనీ నది పరివాహక ప్రాంతంలోనూ నెలకొంది. దీంతో పాటు అధిక వర్షాలతో దిగుబడులుపైనా ప్రభావం చూపడంతో ఇబ్బందులకు గురయ్యారు.

ఎంటీయూ1121పైనే మొగ్గు

దాళ్వా సాగుకు ఎంటీయూ 1121పైనే రైతులు మొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గంలో 75 శాతంకు పైగా రైతన్నలు ఎంటీయూ 1121 ఆకుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో పాటు పీఆర్1216 రకం సాగు చేస్తున్నారు. సార్వా సాగుకు అవసరమైన విత్తనాలు సమకూర్చుకునే రైతులు స్వర్ణ, ఎంటీయూ 1318 వంటి రకాలను సాగు చేస్తున్నారు.

బెంగాలీ కూలీలు రాక

వరి సాగులో గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో రైతులు బెంగాలీ కూలీలపైనే ఆధార పడుతున్నారు. నాట్లు వేయడానికి నారును అతి తక్కువగా వినియోగించడం, తక్కువ మూనలు వేయడం ద్వారా అధిక దిగుబడులకు బెంగాలీ కూలీలు ఉపయోగపడుతుండడంతో సాగులో బెంగాలీలనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. వీరు ఒక్కో గ్రామంలోనూ రెండు మూడు ముఠాలు వస్తుండడంతో వీరిని వినియోగించుకుని తక్కువ ఖర్చుతో సాగు చేస్తున్నారు. కొన్ని గ్రామాలకు ఇప్పటికే బెంగాలీ కూలీలు చేరుకున్నారు.

ఎంటీయూ 1121 వైపే మొగ్గు



దాళ్వా సాగులో రైతులు అందరూ ఎంటీయూ 1121 వైపే మొగ్గు చూపుతున్నారు. సార్వా సాగు ఆఖరిలో వాతావరణం కరుణించడంతో రైతులు అందరూ గట్టెక్కారు. అక్కడక్కడ చెదురుమదురుగా చినుకులు పడినా రైతులు ఇబ్బందులు పడినా నష్టపోలేదు. దీంతో దాళ్వా సాగుకు కోటి ఆశలతో సిద్ధమవుతున్నాం.

– చిటికెన సుబ్బారావు,రైతు, పెనుగొండ